# పాఠం 5: నా ప్రజల్ని వెళ్లనివ్వు!

**పాఠ్య సారాంశం:**
ఇశ్రాయేలు ప్రజలను బానిసత్వము నుండి విడిపించినప్పుడు దేవుడు సృష్టి మీద తన శక్తిని చూపించాడు. దేవుడు మరియు మన సంస్కృతి లేక పరిస్థితుల మధ్య ఎంపిక చేసుకోవలసివచ్చినప్పుడు, మనము ఎల్లప్పుడూ దేవునినే ఎంచుకోవాలి. దేవుడు ఎల్లప్పుడూ మనతో ఉన్నాడు, మరియు మనకు మార్గమును చూపిస్తాడు.

**ముఖ్య అంశము:**
దేవుడు అన్నిటి కంటే బలవంతుడు.

**పాఠ్య లక్ష్యములు:**

* ఐగుప్తులోని బానిసత్వము నుండి ఇశ్రాయేలు ప్రజలు పొందిన విమోచన కథలో దేవుని అద్భుత శక్తిని గూర్చిన అనేక ఉదాహరణలను పిల్లలు గమనిస్తారు.
* తమ జీవితాల కొరకు దేవుని చిత్తమును గుర్తెరిగి ప్రజలను గాక ఆయనను వెంబడించుటను గూర్చి పిల్లలు చర్చిస్తారు.

**బైబిలు భాగము:**
నిర్గమకాండము 3–14

**ముఖ్య వచనము:**
**మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి...**
**ఎఫెసీ. 3:20**

**అవసరమైన వస్తువులు:**

* బైబిలు
* సూపర్‌బుక్ ఎపిసోడ్ #104
* పెద్ద పరిశుభ్రమైన టబ్
* ఒక బల్ల లేక స్టాండు
* ఒక కుర్చీ లేక స్టూలు
* నీరు
* ఒక టవల్



## ఆరంభం *(సుమారుగా 5 నిమిషాలు)*

మిమ్మును మరలా చూడడం సంతోషకరం! క్రొత్తగా వచ్చినవారికి స్వాగతం. మీరు ఇక్కడికి వచ్చినందుకు సంతోషించుచున్నాము. ఇంతకు ముందు ఇక్కడికి వచ్చినవారు, మనము ఏమి మాట్లాడుకున్నామో చెప్పగలరా?

*పిల్లలు చెప్పు కొన్ని జవాబులను విని ముందుకు కొనసాగండి.*

మంచి జవాబులు! మనము సౌలును గూర్చి మరియు దేవుడు ఆయనను క్షమించి మార్చిన విషయమును గూర్చి మాట్లాడాము. మన జీవితాలలో దేవుడు ఎలా కార్యము చేస్తాడో కూడా చూశాము. ఒకరిని మార్చుటకు ఎంతో శక్తి అవసరమైయుంటుంది.

దేవుడు అన్నిటి కంటే, అందరి కంటే బలవంతుడు. ఈ రోజు, బానిసత్వములో నుండి ఇశ్రాయేలు ప్రజలను విడిపించుటకు కాపరియైన మోషేను పంపిన సందర్భములో దేవుని శక్తి యొక్క ఒక ఉదాహరణను చూద్దాము. మండుచున్న పొద, అద్భుతాలు మరియు తెగుళ్ల ద్వారా దేవుని శక్తిని మరియు ఆయన ప్రజల పట్ల కలిగియుండిన దయను చూద్దాము.

అయితే కొనసాగుటకు ముందు, మన ముఖ్య అంశమును నేర్చుకుందాము.

## ముఖ్య అంశము

కదలికలతో ముఖ్య అంశమును పరీక్షించుచుండగా నన్ను వెంబడించండి:

**దేవుడు** *(మీ చేతులను ఆకాశము వైపుకు ఎత్తండి.)*
**అన్నిటికంటే** *(మీ చేతులు బారలుగా చాపండి.)*
**బలవంతుడు.** *(మీ చేతులను ఒక బాడీ బిల్డర్ లాగా బిగపట్టండి.)*

*ముఖ్య అంశమును రెండుసార్లు పునరావృత్తం చేయండి. తరువాత ముందుకు సాగండి.*

ఈ రోజు, మన సూపర్‌బుక్ ఎపిసోడ్ లో, క్రిస్, జాయ్, మరియు గిజ్మోలు మోషే అను ఒక వ్యక్తిని కలవబోతున్నారు. మోషే అసాధ్యమని తలంచిన ఒక పనిని చేయమని దేవుడు కోరాడు. అయితే, మోషే దేవుని మాట విని ఐగుప్తుకు వెళ్లాడు, అక్కడ ఐగుప్తీయులు మరియు ఇశ్రాయేలు ప్రజలు దేవుని శక్తిని చూస్తారు.

ఈ ఎపిసోడ్ లో, దేవుడు తన శక్తిని ఎలా చూపుతాడో జాగ్రత్తగా పరిశీలించండి.

## సూపర్‌బుక్ ఎపిసోడ్ #104ను చూపించండి *(సుమారుగా 30 నిమిషాలు)*

ఐగుప్తు ఒక శక్తివంతమైన దేశము, మరియు ఫరో ఆ ప్రజలను పాలించేవాడు. అయితే సర్వశక్తిగల దేవుడు, ప్రకృతిని శాసించి తెగుళ్లను పంపుట ద్వారా ఐగుప్తును, ఫరోను ఓడించాడు. సృష్టి అంతా దేవుని ఆధీనంలో ఉంది.

## చర్చ& ముఖ్య వచనము *(సుమారుగా 10 నిమిషాలు)*

నేను మిమ్మును ఒక ప్రశ్న అడుగుతాను, దాని జవాబును మీ స్నేహితునితో చర్చించండి.

**ప్రశ్న #1:** ఈ కథలో దేవుడు తన శక్తిని ఎలా చూపించాడు?
**సాధ్యమైన జవాబులు:** మోషేతో మాట్లాడుటకు ఆయన మండుచున్న పొదను ఉపయోగించాడు, ఐగుప్తుకు తెగుళ్లను పంపాడు, మరియు యెర్ర సముద్రమును పాయలు చేసాడు.

*కొన్ని జవాబులను వినండి.*

మంచిది. ఇప్పుడు మరొక ప్రశ్న అడుగుతాను. మీ ప్రక్కన ఉన్నవారితో దీనిని గూర్చి కొద్ది సేపు చర్చించండి.

**ప్రశ్న#2:** తాను దేవుని నమ్మానని మోషే ఎలా చూపించాడు?
**సాధ్యమైన జవాబులు:** మోషే దేవుని మాట విన్నాడు. మోషే దేవునికి ప్రార్థించాడు. మోషే ఫరో యొద్దకు వెళ్లిన ప్రతిసారి ధైర్యమును పెంచుకున్నాడు.

మీ సంభాషణలను మీలో ఎవరైనా పంచుకోవాలనుకుంటున్నారా? *(కొన్ని జవాబులను విని వాటికి స్పందించండి.)* కొనసాగుటకు ముందు, మన ముఖ్య అంశమును మరొకసారి చూద్దాము.
*ముఖ్య అంశమును కదలికలతో పునరావృత్తము చేయండి.*

దేవుడు బలవంతుడు, మనము ఊహించిన దానికంటే ఎక్కువ కార్యములు చేయగలడు! మనము ఆయన మాట విని ఆయనను వెంబడించినప్పుడు, మోషేతో చేసినట్లే మన ద్వారా కూడా కార్యములను చేస్తాడు. దీనిని మీరు బైబిలులోని క్రొత్త నిబంధన పుస్తకమైన ఎఫెసీ పత్రిక 3వ అధ్యాయము, 20వ వచనములో చదవవచ్చు.
*(మీ బైబిలును తెరచి ముఖ్య వచనమును పంచుటకు సిద్ధపడండి.)*

**మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పన మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి...**

*ముఖ్య వచనమును పిల్లలు కొన్నిసార్లు వల్లించిన తరువాత ముందుకు కొనసాగండి.*

## అభ్యాసిక పాఠము & ముగింపు *(సుమారుగా 15 నిమిషాలు)*

పిల్లలు చూడడానికి వీలుగా ఒక టబ్ లో నీరు పోసి ఒక చోట పెట్టండి.

దేవుడు బలవంతుడని మరియు సృష్టి అంతా ఆయన మాట వింటుందని మనము మాట్లాడాము. ఐగుప్తీయుల నుండి ఇశ్రాయేలు ప్రజలను రక్షించుటకు దేవుడు యెర్ర సముద్రమును పాయలు చేసిన సన్నివేశము మీద దృష్టిపెట్టాలనుకొనుచున్నాను. నాకు ఒక వాలంటీర్ కావాలి. మీలో ఎవరైనా వస్తారా?

*ఒక చిన్న బిడ్డను ఎంచుకోండి. పేరు అడిగి గుంపుకు చెప్పండి. ఆ బిడ్డను టబ్ వద్దకు తీసుకువెళ్లండి. ఆ టబ్ వాలంటీర్ మరియు మిగిలిన గుంపుకు మధ్య ఉంచండి. టేబుల్ ఎత్తుగా ఉంటే, ఆ చిన్న బిడ్డను ఒక స్టూల్ మీద నిలబెట్టండి.*

నేను మీకొక చిన్న పని చెబుతాను. టబ్ లోని నీటిని పాయలు చేయుటకు మీ చేతులను ఉపయోగించండి. దానిని ఎక్కువ సేపు చేయవలసిన పని లేదు – ఒకటి లేక రెండు నిమిషాలు అంతే. మీరు ప్రయత్నం చేస్తారా? మంచిది! ఒకసారి ప్రయత్నించండి.

*చేతులతో నీటిని పాయలు చేయుటకు ప్రయత్నించు అవకాశమును చిన్నబిడ్డకు ఇవ్వండి. అది సాధ్యం కాదు. ఆ బిడ్డ చాలా ప్రయత్నించింది అని మీకు అనిపించినప్పుడు, చేతులు బయటకు తీసి టవల్ తో తుడుచుకోమని చెప్పండి.*

*వీలైనంత ఎక్కువమంది (లేక సమయం అనుకూలించిన కొలది) పిల్లలు ప్రయత్నించుటకు అనుమతి ఇవ్వండి. ఇద్దరు పిల్లలను కలిసి ప్రయత్నించమని కూడా అడగవచ్చు. ఎవరూ కూడా నీటిని పాయలు చేయలేరు. మీరు సిద్ధమైనప్పుడు, ముందుకు కొనసాగండి.*

నీటిని పాయలు చేయటం అసాధ్యం కదా? అయినను, సర్వశక్తివంతుడైన దేవుడు సముద్రమును పాయలు చేశాడు, మరియు ఇశ్రాయేలు ప్రజలు ఆరిన నేల మీద నడిచారు. దేవుడు అన్నిటి కంటే బలవంతుడు!

కాబట్టి, దేవుని శక్తికి మనము ఎలా స్పందించాలి? మోషే మనకు కొన్ని సూచనలు ఇస్తున్నాడు:

* మోషే దేవుని మాట విన్నాడు. అలా చేయడం చాలా భయముతో కూడిన పనియైనా, అతడు దేవుని శక్తిని నమ్మాడు.
* మోషే దేవుని ప్రార్థించాడు. పరిస్థితులు మోషే ఆలోచనకు భిన్నంగా మారినప్పుడు, అతడు దేవునికి దూరమవ్వక ఆయనను ఆశ్రయించాడు.

దేవుని వ్యతిరేకించువారు లేక దేవుని విరోధులు దేవునికి లోకమునకు మధ్య ఒకదానిని ఎంచుకోమని మిమ్మును అడుగు పరిస్థితులు వస్తాయి. గుర్తుంచుకోండి: ఈ లోకము ఎంత బలమైనదిగా కనిపించినా, దేవుడు నిరంతరము యేలు రాజు గనుక ఆయన మరింత శక్తిగలవాడు మరియు బలవంతుడు.

కాబట్టి, దేవుని విరోధులను కాదని మన జీవితముల కొరకు దేవుని చిత్తమును కనుగొని ఆయనను ఎలా అనుసరించగలము? *(కొన్ని జవాబులను విని వాటికి స్పందించండి.)*

మనము మోషే ఉదాహరణను అనుసరించవచ్చు. సరైన మార్గమును చూపమని ప్రార్థనలో దేవుని కోరండి. తరువాత దేవుని మాట వినండి. మీ ఆలోచన ప్రకారం పరిస్థితులు జరగనప్పుడు, దేవుని వైపు తిరగండి – ఆయనకు దూరంగా కాదు. బైబిలు చదువుట మీ కొరకు దేవుని చిత్తమును కనుగొనగల మరొక మార్గము. బైబిలు మన కొరకు ఇవ్వబడిన దేవుని వాక్యము. దేవుడు ఎవరో, మన కొరకు ఆయన ఏమి చేశాడో, మరియు ఆయన మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడో అది మనకు చెబుతుంది.

దేవుని నమ్మండి. ఆయన సర్వశక్తిగలవాడు, మరియు మీరు ప్రార్థించిన ప్రతిసారి ఆయన ఆలకిస్తాడు. యేసు ఇలా అన్నాడు, *"లోకములో మీకు శ్రమకలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నానని నేను." (యోహాను 16:33)*

ప్రార్థన చేసుకుందాం. ప్రార్థన అంటే దేవునితో మాట్లాడుట. కొన్ని నిమిషాలు మౌనంగా ప్రార్థించండి; తరువాత నేను అందరి కొరకు ప్రార్థిస్తాను. మీరు ప్రార్థించుచుండగా, ఇశ్రాయేలును మరియు మనలను విడిపించినందుకు దేవునికి వందనాలు చెప్పండి. సరైన పని చేయుటలో మీకు సహాయం చేయమని ఆయనను అడగండి. ఆయన మీద మరియు ఆయన శక్తి మీద నమ్మికయుంచునట్లు మీకు సహాయం చేయమని దేవుని అడగండి.

*పిల్లలను కొద్ది సేపు మౌనంగా ప్రార్థన చేయనియ్యండి; తరువాత పిల్లల కొరకు ప్రార్థించండి.*

దేవా, నీవు సర్వశక్తిగలవాడవు. నీ సృష్టి యంతటి మీద నీ శక్తిని చూపావు. నీ మీద మరియు నీ శక్తి మీద నమ్మికయుంచునట్లు మాకు సహాయం చేయుము. మేము మాట విని నిన్ను వెంబడించునట్లు చేయుము. ఆమెన్.

ఈ రోజుకు మన వద్ద ఉన్న సమయము ఇంతే. మాతో సమయము గడిపినందుకు ధన్యవాదాలు. మనము వెళ్లుటకు ముందు, ముఖ్య అంశమును మరొకసారి చెబుదాము.

*ముఖ్య అంశమును కదలికలతో పునరావృత్తము చేయండి.*

*పిల్లలను ఇంటికి పంపివేయండి.*

ముగింపు